నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 7 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET

# సీఐపై డీఐజీకి తల్లిదండ్రుల ఫిర్యాదు

- ఆస్తిలో వాటా ఎక్కువ కావాలని వేధిస్తున్నాడని ఆవేదన

ఖిల్లాఘణపురం, ఆగస్టు 6 : ఆస్తిలో అధిక వాటా కావాలంటూ వేధిస్తున్న సీఐపై ఆయన తల్లిదండ్రులే డీజీపీకి ఫిర్యాదు చేసిన ఘటన మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాంపల్లికి చెందిన రఘునాథ్‌రెడ్డి, బొజ్జమ్మ దంపతులకు వెంకటేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డిని ఎన్నో కష్టాలు పడి పోలీస్‌ను చేశారు. ప్రస్తుతం ఆయన రాచకొండ మల్టీజోన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. రఘునాథ్‌రెడ్డి, బొజ్జమ్మ.. కుమారులు, కూతుళ్లకు ఆస్తిలో వాటాలు చేసి ఇచ్చారు. రఘునాథ్‌రెడ్డి పేరుమీద ఉన్న 18ఎకరాలు, బొజ్జమ్మ పేరుమీద ఉన్న 12 ఎకరాలు మొత్తం 30 ఎకరాల్లో సీఐ వెంకటేశ్వర్ రెడ్డి తనకు అధిక వాటా 20 ఎకరాలు కావాలని గొడవ చేయడంతో 15 ఎకరాలు, యాదిరెడ్డికి 11 1/2 ఎకరాలు, ఇద్దరు కూతుళ్లకు ఒకటిన్నర ఎకరం ఈ ఏడాది ఫిబ్రవరి 2న రిజిస్ట్రేషన్ చేయించారు. మిగతా రెండు ఎకరాలను తమ పేర్లపై ఉంచుకున్నారు. అయినప్పటికీ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి అదనంగా ఐదు ఎకరాలు ఇవ్వాలని తమ్ముడు యాదిరెడ్డిని బెదిస్తున్నారని సోమవారం డీజీపీ కార్యాలయాన్ని ఆశ్రయించి డీఐజీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో తమపైనా పలుమార్లు దాడి చేశాడని, ఆ ఆవేదనలతో చనిపోవాలని కూడా నిశ్చయించుకున్నామని, తమకు వెంకటేశ్వర్‌రెడ్డి నుంచి రక్షణ కల్పించాలని డీఐజీని కోరారు.

# మళ్లీ తెరపైకి చమన్‌ఖాన్‌దొడ్డి వ్యవహారం


మాట్లాడుతున్న ఎస్సై, కోర్టు సిబ్బంది

గట్టు, ఆగస్టు 6 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన చమన్‌ఖాన్‌దొడ్డి వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. గ్రామం పొలం మాదేనంటూ కొందరు కోర్టులో దాఖలు చేయగా గ్రామంలో నివసిస్తున్న వారందరినీ ఖాళీ చేయమని అప్పట్లో ఒత్తిడి వచ్చింది. ఈ క్రమంలో ఆర్డీవో గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు చేరవేశారు. ఈక్రమంలో ఎస్సై కేటీ మల్లేశ్ ఆధ్వర్యంలో గద్వాల కోర్టు సిబ్బంది చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఈ క్రమంలో కోర్టు సిబ్బంది 129 సర్వే నెంబర్‌లోని 11 ఎకరాల 2 గుంటల భూమి స్వాధీనం చేసుకోవాలంటూ ఆర్డర్‌ను స్థానికులకు చూయించారు. అయితే ఆ ప్రాంతంలో ఇండ్ల నిర్మాణాలు, ఆలయాలు, పాఠశాల భవనాలు, ప్రభుత్వ భవనాలు ఉండడంతో వారు చేసేదేమీలేక వెనుదిరిగి వెళ్లారు.

# ఆకలి కేకలు!

ఫుడ్ తింటే పాయిజన్

- పురుగుల అన్నం.. నీళ్ల చారే దిక్కు
- దవాఖాన పాలవుతున్న విద్యార్థులు
- నిర్లక్ష్యం నీడలో ఎస్‌వోలు.. సిబ్బంది
- పర్యవేక్షణ మరిచిన అధికారులు
- సమస్య వచ్చాక సస్పెన్షన్లతో సరి
- గురుకులాలు, కేజీబీవీలలో నాణ్యత లేని భోజనం


పెంట్లవెల్లి కేజీబీవీ

నాగర్‌కర్నూల్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : పని కోసం ఉపాధికి వెళ్లే తల్లిదండ్రులు, ఉన్న ఊళ్లోని బడి కంటే గురుకులాల్లో చదువులు బాగుంటాయి.., మంచి భోజనం దొరుకుతుంది.. మా పిల్లలు బాగా చదువుకొంటారని భావిస్తున్న తల్లిదండ్రులకు ఇటీవలి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సంబంధిత పాఠశాలల స్పెషల్ అధికారులు, ప్రిన్సిపాళ్ల నిర్లక్ష్యానికి తోడు సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ కరువై కలుషితాహారం తిని బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు.. ముందు ప్రాణాలతో ఉంటే చాలు అన్న చందంగా మారడం విచారకరం. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెల్దండ మోడల్ స్కూల్, తాజాగా పెంట్లవెల్లి కస్తూర్బాలోని సంఘటనలతో ఆయా విద్యాలయాల తీరుపై తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

***నాణ్యతలేకుండా ఫుడ్***

గురుకులాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో మండల, జిల్లా పరిషత్‌లాంటి ప్రభుత్వ పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తీసుకున్న చర్యలతో పెద్ద ఎత్తున గురుకులాలు ఏర్పాటయ్యాయి. ఈ విద్యాలయాల్లో చదువు, భోజనం, వసతిలాంటి సౌకర్యాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీంతో ఆయా పాఠశాలలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలు, లక్కీడీప్ ఎంపికలకు ఉన్న సీట్లకంటే రెట్టింపు సంఖ్యలో విద్యార్థుల నుంచి డిమాండ్ వస్తోన్న పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బాల్లో చదువుకోవడానికి ఆసక్తి చూపించేందుకు తల్లిదండ్రులు, విద్యార్థులూ ఇష్టం చూపిస్తున్నారు. ఫలితంగా పూర్తిస్థాయి సీట్లతో ఆయా విద్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు భద్రత కల్పించేలా భవనాలతో కూడిన వసతులు అందుతున్నాయి. ఇక ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనంలో వివిధ రకాల వంటకాలు రుచికరంగా అందిస్తున్నారు. ఇక ఉపాధ్యాయులను కూడా పెద్ద ఎత్తున నియమించారు. దీనివల్ల విద్యార్థులకు ఈ పాఠశాలలు విద్యాలయాలుగా మారాయి. అలాంటి పాఠశాలలు ఇటీవల కాలంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు భయానకంగా మారుతున్నాయి. గతంలో అచ్చంపేటలోని ఓ గురుకులంలో బాలిక మృతి చెందగా పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. ఇదిలా ఉండగా తాజాగా వెల్దండలోని ఆదర్శ పాఠశాలలో భోజనం నాసిరకంగా ఉందని విద్యార్థులు భోజనం తినలేక ఆపసోపాలు పడ్డారు. 20మంది వరకు విద్యార్థులు రెండు రోజులపాటు కడుపు నొప్పితో బాధపడ్డారు. స్థానిక దవాఖానలో చూపించగా, మరికొందరికి కల్వకుర్తిలో చికిత్సలు చేయించారు. ఇది చూసిన తల్లిదండ్రులు కొందరు తమ పిల్లలను ఇండ్లకు తీసుకెళ్లారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య కూడా ఇబ్బంది కలిగిస్తోంది. స్నానాల గదులు, మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేవు. ఏఎన్‌ఎంలాంటి వైద్య సిబ్బంది కూడా లేరు. వంట సిబ్బంది తీరూ సరిగ్గా లేదు. ఈ క్రమంలో అనారోగ్యం బారిన పడిన విద్యార్థులకు చికిత్స అందించడంలోనూ సంబంధిత పాఠశాల అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థులు రోదించడం గమనార్హం. ఈ సంఘటనలో తప్పు కేర్ టేకర్‌దేనని ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా విద్యార్థులకు ఆహారం, అనారోగ్యం సోకితే తమ పిల్లలుగా భావించాల్సిన సిబ్బంది బాధ్యతల ప్రస్తావన తీసుకురావడం బాధ్యతారాహిత్యమనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ పాఠశాల సంగతి ఇలా ఉంటే.. పెంట్లవెల్లి కస్తూర్బాది మరీ అధ్వానం. ఈనెల 16న ఆదివారం కలుషిత ఆహారం తిని 18 మంది బాలికలు అనారోగ్యానికి గురయ్యారు. బాలికలు వాంతులు చేసుకోగా కొల్లాపూర్ దవాఖానకు తరలించి చికిత్సలు నిర్వహించారు. అదేరోజు రాత్రి ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థినులను కలిసి ఆరా తీశారు. మరుసటి రోజు నియోజకవర్గంలోని కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించి, నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. మధ్యాహ్నం కలెక్టర్ సంతోష్ పాఠశాలకు వెళ్లి స్వయంగా బాలికలతోపాటుగా భోజనం చేశారు. అంతా మంచిగా ఉందనుకుంటే అదే రోజు సాయంత్రం భోజనాలు చేసిన తర్వాత మరో 15 మంది బాలికలతోపాటుగా ఇద్దరు ఉపాధ్యాయినులు వాంతులు చేసుకోవడం విశేషం. ఈ సంఘటనతో విద్యార్థుల్లో మరింత ఆందోళన నెలకొంది. తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని విద్యార్థుల పరిస్థితి చూసి ఆవేదన చెందారు. పాఠశాలకు తీసుకొచ్చిన బియ్యం పాతవి కావడంతోపాటు నాసిరకమైన కూరగాయలు వండటంతో ఈ పరిస్థితి వచ్చిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఆయా విద్యాలయాల్లో తక్కువ ధరకు దొరికే నాసిరకమైన కూరగాయలు, కాలం చెల్లిన బియ్యంతో చేసిన వంటకాలే ఈ పరిస్థితికి కారణంగా కనిపిస్తోంది. కాగా ఈ పాఠశాలలను తరచూ పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల సంబంధిత పాఠశాలల సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. మంత్రి, కలెక్టర్ వచ్చాక కూడా పెంట్లవెల్లిలో అదే పరిస్థితి పునరావృతమవ్వడమే దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఇలా రెండోసారి జరిగాక కస్తూర్బా ప్రత్యేక అధికారి స్వప్న, నలుగురు వంట సిబ్బందిని తొలగించడం విశేషం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారుల తీరు ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు మంచి భోజనం, విద్యకోసం లక్షల్లో నిధులు వస్తుంటే నాణ్యమైన భోజనం, విద్యను అందించకుండా స్వాహా చేసేలా సిబ్బంది ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.


సోమవారం అస్వస్థతకు గురైన పెంట్లవెల్లి కస్తూర్బా విద్యార్థినులు

- నేడు జాతీయ చేనేత దినోత్సవం

# నేతన్న కళాత్మకతకు గౌరవం

- గద్వాల జిల్లాలో ఇద్దరు కార్మికులకు రాష్ట్ర స్థాయి పురస్కారం
- గర్వంగా ఉందంటున్న నేతన్నలు
- కేసీఆర్ ప్రభుత్వంలో పూర్వ వైభవం



## చేనేత కార్మికుల కష్టాలు వర్ణణాతీతం

పోగుపోగును కలుపుతూ వస్త్రాన్ని తయారు చేయడంలో వారికి ఎదురయ్యే ఒడిదుడుకులు అనేకం. సాధారణానికి భిన్నంగా నేతను నేయడమే కార్మికుల గొప్పదనం. వస్త్రాలపై వారి కళాకృతులు అందరినీ మైమరిపిస్తుంటాయి. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ఏటా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఇచ్చే కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఐదుగురు ఎంపిక కాగా.. ఇందులో గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి చేనేత కార్మికుడు గడిగె మునెప్ప ఒకరు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో 7వ తేదీ బుధవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతులమీదుగా మునెప్పకు రూ.25వేల నగదు అందజేసి సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా మునెప్ప మాటలు ఇవీ..

నాకు 60 ఏండ్లు ఉంటాయి. ఇప్పుడు కూడా మగ్గం నేయడమే నా వృత్తి. ఓపిక అవసరమయ్యే కండెలు చుట్టడం, తోడడం పనులు కూడా నేనే చేస్తుంటాను. సాధారణ డిజైన్‌లో చీరలు నేయడమంటే నాకు ఏమాత్రం ఇష్టముండదు. నేతలో ఎప్పుడూ ప్రత్యేకత ఉండాలని కోరుకుంటాను. మాస్టర్ వీవర్స్ చీరలను ఈవిధంగా నేయాలని డిజైన్లు ఇస్తుంటారు. అయితే దాంట్లో మార్పులు చేర్పులని సూచిస్తుంటాను. మా ఇంట్లో నాలుగు మగ్గాలు ఉన్నాయి. కుటుంబంలో తొమ్మిదిమంది దాకా నేత పనులనే చేస్తుంటాం. నేత మాకు ఇష్టమైన పని. తరతరాలుగా మగ్గం నేతలోనే ఉన్నాం. ఈ వృత్తిని వదలడానికి ఇష్టం ఉండడంలేదు. నా చే'నేత' నైపుణ్యాన్ని ప్రభుత్వం గుర్తించి పురస్కారానికి అందజేస్తుండడం ఆనందంగా ఉంది.

గద్వాల, ఆగస్టు 6 : వ్యవసాయం తరువాత ఎక్కువ శాతం ప్రజలకు జీవనోపాధిగా మారిన వృత్తి చేనేత. కర్ని, సాలే, దూదేకుల, రజక, మైనార్టీ కులాల్లో మెజార్టీగా చేనేత వృత్తిని ఆసరా చేసుకొని జీవనం సాగిస్తున్నాయి. గద్వాల.. జరీ చీరలకు పెట్టింది పేరు. దేశవ్యాప్తంగా కాక విదేశాల్లో సైతం గద్వాల చీరలకు పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. గద్వాల డివిజన్‌లో గద్వాల, అనంతపురం, కుర్వపల్లి, కాకులారం, ధరూర్, గట్టు, మాచర్ల, అరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, మల్దకల్, బూడిదపాడు, నాగర్‌దొడ్డి, అలంపూర్, రాజోళి, ఎక్లాస్‌పురం, అయిజ ప్రాంతాల్లో దాదాపు 6 948 పైగా కుటుంబాలు చేనేత వృత్తిపై ప్రత్యక్షంగా, పరోక్షంగాను ఉపాధిని పొందుతున్నాయి. గత ప్రభుత్వం చేనేత కార్మికులకు చేయూత నివ్వడంతో కార్మికులు తమ పూర్వవృత్తి వైపు మళ్లీ చీరలు నేస్తూ ఉపాధి పొందుతున్నారు. గద్వాల చేనేత కార్మికులకు సాంకేతికతను ఉపయోగించి విభిన్నమైన డిజనైన్లను, వినూత్న రకాల డిజైనింగ్ విభాగంలో జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు ఎంపిక కావడం చూస్తుంటే ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యం ఎలాంటిదో తెలిసిపోతుంది. ఒక నాడు సడుగులు విరిగిన సాలేల మగ్గం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ చేయూతతో పూర్వవైభవం సంతరించుకున్నది. అందుకు కారణం గత ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం చేనేత బీమా, త్రిఫ్ట్ తదితర పథకాలు ప్రవేశపెట్టడంతో వారు ఉపాధి పొందడంతోపాటు కనుమరుగువుతున్న చేనేత వృత్తిని కాపాడుతున్నారు.

***గతమెంతో ఘనం..***

గద్వాలకు చీరలకు దాదాపు 300 ఏండ్లు దాటాయని చరిత్ర చెబుతున్నది. గద్వాల జరీ చీరల స్థానం సుస్థిరం. జరీ చీరల ప్రస్థానం ఈ నాటిదికాదు. సంస్థానాధీశుల కాలంలోనే గద్వాల చేనేతకు ప్రత్యేకత ఉన్నది. నాటి రాజుల ప్రోత్సాహంతో ప్రపంచ ఖ్యాతిని దక్కించుకున్నది. అగ్గిపెట్టెలో పట్టుచీర మలిచిన అద్భుత కళానైపుణ్యం మన నేతన్న సొంతం. నేతన్నలు నేచిన చీరలకు ఎల్లలు దాటిన ప్రాశస్త్యం. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి పాలకులు నేతన్నలను పట్టించుకోకపోవడంతోపాటు ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో హస్తకళలకు ప్రోత్సాహం కరువు కావడంతో నేతన్నలు ఇతర పనులపై దృష్టి పెట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే నేతన్నకు మంచి రోజులు వచ్చాయి.


రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన వెంకటేశ్ నేచిన చీర

***చేనేత కార్మికులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు..***

చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో అందించే కొండా లక్ష్మణ్‌బాపూజీ రాష్ట్ర స్థాయి పురస్కారాలకు జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి ఇద్దరు కార్మికులను ఎంపిక చేశారు. గద్వాలలోని వేదనగర్‌కు చెందిన బావండ్ల జాకెట్ వెంకటేశ్, గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డికి చెందిన మునెప్ప ఎంపికయ్యారు. చేనేత దినత్సోవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వేడుకల్లో వీరికి ప్రభుత్వం తరపున పురస్కారాన్ని అందించనున్నారు.

***చాలా సంతోషంగా ఉన్నది..***



నేను నేసిన చీరకు రాష్ట్రస్థాయి పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉంది. 30 ఏండ్ల నుంచి చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. పురస్కారం అందుకోవడం గర్వంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత చేనేత కార్మికులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. చంద్రునికో నూలు పోగు అనే కాన్సెప్ట్‌ను అనుసరించి ప్రత్యేకమైనా డిజైన్‌తో చీర నేశాను. మహిళలు నూలు పోగులు చందమామకు సమర్పిస్తున్న డిజైన్‌తో చీర కొంగును రూపొందించాను. చందమామను కొలుస్తూ మరాఠీలో రాసిన కీర్తనలు పొంది చీరను నేశాను.

*- వెంకటేశ్, రాష్ట్ర స్థాయి పురస్కార గ్రహీత, వేదనగర్, గద్వాల*

# దాయాదుల దాడిలో వ్యక్తి హత్య

- అడ్డాకుల మండలం కాటవరంలో ఘటన
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు

మూసాపేట(అడ్డాకుల), ఆగస్టు 6 : ఓ వ్యక్తిని దాయాదులు, వారి అనుచరులు విచక్షణా రహితంగా కొట్టి దారుణంగా హత్య చేసిన ఘటన అడ్డాకుల మండలంలోని కాటవరం గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాలెం కొల్లంపల్లి యాదవ్ (42)కు పద్మ అనే యువతితో వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొల్లంపల్లియాదవ్ కాటవరం గ్రామంలోనే నివాసం ఉంటూ వ్యవసాయంతోపాటు గొర్రెలను పెంచుతున్నాడు. అయితే మూడు రోజుల కిందట వేరే విషయంలో దాయాదులతో తగాదా వచ్చి మాటామాటా అనుకున్నట్లు తెలిపారు. కొల్లంపల్లి విషయం ఏదో తేల్చుకోవాలని దాయాదులు వారికి తెలిసిన బయటి వ్యక్తులు మరికొందరిని కారులో పిలిపించుకున్నారు. మంగళవారం ఉదయం కొలంపల్లి పొలం వద్దకు వెళ్లగా గమనించిన దాయాదులు వారు పిలుపుంచుకున్న వారితో కలిసి వెళ్లారు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగానే మూకుమ్మడిగా కొల్లంపల్లిపై దాడి చేశారు. దాడికి తట్టుకోలేక అతను కేకలు వేయగా.. జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి చూసి కాటవరం గ్రామానికి చెందిన మరో వ్యక్తికి పలాన బావి వద్ద ఎవరో ఓ వ్యక్తిని కొడుతున్నారని సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా గ్రామం నుంచి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే కొల్లంపల్లిని తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొల్లంపల్లిని కుటుంబ సభ్యులు కారులో జిల్లా దవాఖానకు తరలించారు.



దాడి చేస్తున్న దాయాదులు, కొలంపల్లి (ఫైల్)

అక్కడి వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లుగా తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూత్పూర్ సీఐ రామకృష్ణ తెలిపారు.

***కాటవరంలో ఉద్రిక్తత***

కొల్లంపల్లిని హత్య చేసిన విషయం తెలియడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. దాడి చేసిన వారు వచ్చిన కారును పోలీసులు తీసుకెళ్లడానికి రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులను అడ్డగించారు. దీంతో కారును సీజ్ చేయాలి, కారును ఇక్కడ ఉంచకూడదని అందరికీ నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# గుడ్డెందొడ్డిలో నిలిచిన పంపింగ్

- ఎస్‌ఎఫ్‌సీలో సాంకేతిక సమస్య
- బీహెచ్‌ఈఎల్ కంపెనీతో సంప్రదింపులు

ధరూరు, ఆగస్టు 6 : నెట్టెంపాడు లిఫ్ట్ పేజ్-1 వద్ద సాంకేతిక సమస్యతో పంపింగ్ నిలిచిపోయింది. సోమవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా మోటర్లు మొరాయించడంతో నీటి విడుదల బంద్ అయినట్లు సమాచారం. దీనిపై నెట్టెంపాడు ఈఈ రహీమొద్దీన్‌ను వివరణ కోరగా లిఫ్ట్ ఫేజ్-1లో పంపింగ్ నిలిచిపోయిన మాట వాస్తవమే అన్నారు. అయితే మోటర్లలో ఎలాంటి సమస్య లేదని, ఆన్ చేసే (ఎస్‌ఎఫ్‌సీ) స్టాటింగ్ ఫ్రీక్వెన్సీ కన్వర్టర్ సిస్టంలో సాంకేతిక సమస్యతో పంపింగ్ నిలిచినట్లు చెప్పారు. బీహెచ్‌ఈఎల్ కంపెనీ ఇంజినీర్స్ సమాచారం అందించాం. కంపెనీకి నిర్వహణకు సంబంధించి కొంత బిల్లులు ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అందుకే మరమ్మతులకు మేము ప్రయత్నాలు చేస్తున్నామని, త్వరలోనే పూర్తి చేసి పంపింగ్ కొనసాగిస్తామని చెప్పారు. ప్రస్తుతం గుడ్డెందొడ్డి 0.6 టీఎంసీ, ర్యాలంపాడు రిజర్వాయర్‌లో 1.5 టీఎంసీల నీటిమట్టం ఉందని, 20 రోజుల వరకు సాగునీరు అందించేందుకు సరిపోతాయని ఈఈ తెలిపారు.

# ఫ్యాన్సీ నెంబర్‌కు రూ.5.75 లక్షలు

- టీజీ 06 6666 కారుకు నెంబర్ దక్కించుకున్న బాలకృష్ణ

మహబూబ్‌నగర్, ఆగస్టు 6 : ఆల్ సిక్స్ నెంబర్ మాజీ సీఎం కేసీఆర్ అదృష్ట సంఖ్యగా వాడుతున్న వాహన నెంబర్.. అలాంటి ఫ్యాన్సీ నెంబర్‌కు మంగళవారం యాక్షన్‌లో టీజీ 06 6666 కోసం రూ.5.75 లక్షలకు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కోలి బాలకృష్ణ దక్కించుకున్నాడు. ఆన్‌లైన్‌లో ఈ ఫ్యాన్సీ నెంబర్ కోసం 9 మంది పోటీ పడ్డారు. చివరకు బాలకృష్ణ సొంతం చేసుకోవడంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది.

## నేతలు, అధికారుల వేధింపులు


# అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం


ఉప్పునుంతల, ఆగస్టు 6 : అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు, ఉన్నతాధికారుల ఒత్తిడితో మనస్తాపం చెందిన అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. అంగన్‌వాడీ టీచర్ భర్త పానుగంటి శ్రీను కథనం మేరకు.. ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన తాను బీఆర్‌ఎస్ కార్యకర్త అని.. తన భార్య శారద అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నదన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్దిరోజులుగా స్థానిక నాయకులు మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సీడీపీవో ద్వారా అంగన్‌వాడీ టీచర్‌పై ఒత్తిడి తెచ్చి తరచుగా తప్పులు చేయకున్నా మెమోలు జారీ చేస్తున్నారని వాపోయారు. వీటికి లిఖితపూర్వకంగా తన భార్య జవాబు ఇచ్చినా వాటిని పట్టించుకోకుండా సంబంధిత సూపర్‌వైజర్, సీడీపీవో కాంగ్రెస్ నేతల ఒత్తిడికి తలొగ్గారన్న ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుల వద్దకు వెళ్లి మాట్లాడుకోవాలని సూపర్‌వైజర్ తనకు సూచించినట్లు వివరించారు. దీనికి నా భార్య శారద తాను దళిత మహిళనని, తాను చేసిన తప్పేంటి.. వారి వద్దకు ఎందుకు వెళ్లాలని ప్రశ్నించడంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ నోటీస్ జారీ చేశారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న నూనె ప్యాకెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినా తన భార్యే తీసుకెళ్లినట్లు ఆరోపణలు చేశారన్నారు. చోరీ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేదన్నారు. దీనికితోడు తన భార్యపై నిందలు మోపడంతో మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగిందని పేర్కొన్నారు. వెంటనే గుర్తించి నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతున్నదని చెప్పారు. కాగా సీడీపీవో లక్ష్మి, సూపర్‌వైజర్ బీపాషాను వివరణ 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించగా.. వారు అందుబాటులోకి రాలేదు. అయితే అంగన్‌వాడీ టీచర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన సూపర్‌వైజర్, సీడీపీవో, కాంగ్రెస్ పార్టీ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు. మా కుటుంబానికి హాని జరిగితే ఈ ముగ్గురే బాధ్యత వహించాలన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రావు మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

# పాఠశాల గదిలో విద్యార్థి

- బయట తాళం వేసిన సిబ్బంది

ఉండవెల్లి, ఆగస్టు 6 : విద్యార్థిని పాఠశాల తరగతి గదిలో ఉంచి తాళం వేసిన ఘటన మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికులు కథనం మేరకు.. ఉండవెల్లి గ్రామానికి చెందిన బోయ రాముడు కుమారుడు ఉదయ్ స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసిన విద్యార్థి సాయంత్రం 3 గంటల తర్వాత పాఠశాల గదిలో నిద్రపోయాడు. సాయంత్రం సమయం ముగిసాక తరగతిగది నుంచి విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. అతడిని ఎవరూ నిద్ర లేకపోవడంతో అలాగే ఉండిపోయాడు. పాఠశాల తాత్కాలిక అటెండర్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉండడంతో అతడి భార్య తరగతిలో విద్యార్థిని గమనించకుండా గదికి తాళం వేసి వెళ్లిపోయింది. కొద్దిసేపటికి మెలకువ వచ్చిన విద్యార్థి తాళం వేసి ఉండడం చూసి ఏడ్చాడు. స్థానికులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వడంతో అటెండర్ భార్యతో తిరిగి గది తాళం తీయించి అతడి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ప్రధానోపాధ్యాయుడు మునిస్వామి తెలిపారు. ఈ విషయంపై ఎంఈవో శివప్రసాద్‌ను వివరణ కోరగా ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూస్తామన్నారు.


పాఠశాల గదికి తాళం వేయగా లోపలే ఉన్న విద్యార్థి


కల్వకుర్తి ఎస్‌బీఐ వద్ద క్యూలో ఉన్న రైతులు

# రుణమాఫీ ఇక్కట్లు

బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు

కల్వకుర్తి, ఆగస్టు 6 : రుణమాఫీ రైతులకు కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది. రుణమాఫీ కాని రైతులు తమకు రుణాలు ఎందుకు మాఫీ కాలేదని వ్యవసాయాధికారులు, బ్యాంకర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా, రుణమాఫీ వచ్చిన రైతులు కొత్త రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. వానకాలం కావడంతో ఒక పక్క వ్యవసాయ పనులు, మరో పక్క పెట్టుబడుల కోసం రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రభుత్వం రైతు బంధు ఊసెత్తకపోవడంతో.. పెట్టుబడి డబ్బుల కోసం షావుకారులను మిత్తికి డబ్బులు అడుగుతున్నారు. తులమో మా సమో బంగారం ఉన్నా రైతులు వాటిని కుదువ పెట్టేందుకు బ్యాంకుల వద్దకు వస్తున్నారు. రైతులు ఒకేసారి బ్యాంకుల వద్దకు వస్తుండడంతో బ్యాంకుల వద్ద రద్దీ నెలకొంది. ఉదయం 8గంటల నుంచి రైతులు బ్యాంకుల వద్దకు చేరుకొని బ్యాంకు తెరిచే వరకు క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.